www.kalamjyothi.com

# కలం జ్యోతి

తెలుగు దినపత్రిక

బుధవారం

16.09.2026







# యూపీఐకి నయా రూల్స్

డిజిటల్ విప్లవానికి మరింత ఊతం

## పర్సన్ టు పర్సన్ ఉచిత సేవలే

- చిన్న వ్యాపారులపై పడని భారం
- వ్యాపార విస్తరణకు ప్రత్యేక నిధి
- రూ.2 వేలు దాటితే నామమాత్రపు ఛార్జీ
- రైల్వేలు, ఇంధనం, బీమా లావాదేవీలపై ఫ్లాట్ రూ.5 వర్తింపు

"దేశంలో కోట్లాది మంది వినియోగిస్తున్న యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులకు పూర్తి ఊరటనిస్తూనే.. సాంకేతికత, సైబర్ భద్రతను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో సరికొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) నిబంధనలను అక్టోబర్ 15 నుంచి అమల్లోకి తీసుకురానుంది. సామాన్యుడి జేబుపై ఎలాంటి భారం పడకుండా, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరించడమే లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయం దేశీయ ఆర్థిక రంగంలో సరికొత్త చర్చకు దారితీసింది.

**కలంజ్యోతి, న్యూఢిల్లీ (సెప్టెంబర్ 16) :** దేశంలో డిజిటల్ లావాదేవీలను సరికొత్త పుంతలు తొక్కిస్తూ పటిష్టమైన భద్రత, సాంకేతిక ఆవిష్కరణలను విస్తరించేందుకు కేంద్రం కీలక సంస్కరణలు చేపట్టింది. వినియోగదారులకు యూపీఐ సేవలను ఉచితంగానే కొనసాగిస్తూ, ఎంపిక చేసిన వ్యాపారి లావాదేవీలపై సవరించిన మర్చంట్

మిగతా 2లో..




# ఆగాఖాన్‌తో రేవంత్‌రెడ్డి భేటీ

- వారసత్వ సంపద పునరుద్ధరణకు సహకరించండి
- ఫ్యూచర్ సిటీలో విశ్వవిద్యాలయం పెట్టండి
- గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం

2లో



# టెట్ కీ విడుదల

- ప్రాథమిక కీ వెబ్‌సైట్‌లో అందుబాటులో
- రేపటి వరకే అభ్యంతరాలు
- ఆన్‌లైన్‌లోనే ఆధారాలతో నమోదు సమయం

2లో







శ్రీ వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా.. ఎర్రవెల్లి నివాసంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, శోభమ్మ దంపతులు

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
బుధవారం 16.09.2026
www.kalamjyothi.com



# టెట్ కీ విడుదల

- ప్రాథమిక కీ వెబ్‌సైట్‌లో అందుబాటులో
- రేపటి వరకే అభ్యంతరాలు
- ఆన్‌లైన్‌లోనే ఆధారాలతో నమోదు సమయం





**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 16) :** రాష్ట్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రాథమిక సమాధానాల సూచికను విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీటెట్)-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 ప్రాథమిక కీ అధికారికంగా విడుదలైంది. సెప్టెంబర్ 8, 9 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించిన ఈ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు తమ సమాధాన పత్రాలను, ప్రాథమిక కీని పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

**రేపటి వరకే అభ్యంతరాలకు అవకాశం..**

విడుదల చేసిన ప్రాథమిక కీపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా వాటిని నమోదు చేయడానికి విద్యాశాఖ వెసులుబాటు కల్పించింది. అభ్యర్థులు తమ అభ్యంతరాలను సెప్టెంబర్ 17వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుందని అధికారులు తెలిపారు.

**ఆన్‌లైన్‌లోనే ఆధారాలతో నమోదు..**

ప్రాథమిక కీలోని సమాధానాలపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ సందర్శించి నమోదు చేసుకోవాలని సూచించారు. అందులోని సంబంధిత అభ్యంతరాల లింక్ ద్వారా సరైన ఆధారాలతో తమ అభ్యంతరాలను సమర్పించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అంటే సెప్టెంబర్ 17 సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చే ఎలాంటి దరఖాస్తులను లేదా అభ్యంతరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేశారు.



# సాదులనగర్‌లో గణేశుడి వైభవం



**కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 16) :** సాదులనగర్ గ్రామంలో కొలువైన గణనాథునికి భక్తులు భక్తిశ్రద్ధలతో విశేష పూజాధికాలు నిర్వహించారు. హత్నూర మండల పరిధిలోని సాదులనగర్ గ్రామంలో శ్రీ దుర్గాభవాని వినాయక కమిటీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి రెండో రోజు ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ ప్రజలను, పిల్లాపాపలను సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంచాలని ఆ విఘ్నేశ్వరుని వేడుకున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో వేద పండితులచే రెండో రోజు గణనాథునికి పూజలు నిర్వహించినట్లు దుర్గాభవాని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విఘ్నేశ్వర భక్తులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కార్డుల పంపిణీ

# స్మార్ట్ కార్డుల జాతర



**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 16) :** నిర్మల్ పట్టణంలోని 10, 36 వార్డుల్లో అర్హులైన ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జోరుగా సాగింది. ఈ కార్డులను మున్సిపల్ వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపు గోపీ, ఎస్పీ రాజు, మాజీ కౌన్సిలర్లు ఎలుగు సుధాకర్, శ్రీధర్, డీలర్లు అభిలాష్, రాజు, సంపత్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# యూపీఐకి నయా రూల్స్

▶▶ మొదటిపేజీ తరువాయి

డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానాన్ని అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. అధిక విలువ కలిగిన లావాదేవీలపై విధించే నామమాత్రపు ఛార్జీల ద్వారా యూపీఐ వ్యవస్థ భద్రతను పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది.

**చిన్న వ్యాపారులపై పడని భారం..**

సాధారణ ప్రజలు, వినియోగదారులు ఇప్పటి వరకు మాదిరిగానే యూపీఐ ద్వారా పూర్తిగా ఉచితంగా లావాదేవీలు కొనసాగించుకోవచ్చు. వ్యక్తి నుంచి వ్యక్తికి (పీ2పీ), వ్యక్తి నుంచి వ్యాపారికి (పీ2ఎం) జరిగే రూ.2,000 వరకు లావాదేవీలపై ఎండీఆర్ వర్తించదు. యూపీఐ క్యూఆర్ చెల్లింపుల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోకి స్వీకరించే చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్ వర్తిస్తుండటంతో చిరు వ్యాపారుల పై ఎలాంటి అదనపు భారం పడదు.

**వ్యాపార విస్తరణకు ప్రత్యేక నిధి..**

చిన్న వ్యాపారుల్లో యూపీఐ వినియోగాన్ని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే సేవలు అందిస్తున్న చిరు వ్యాపారులతో పాటు టైర్3 పట్టణాలు, గ్రామీణ మార్కెట్లలో డిజిటల్ చెల్లింపుల మౌలిక వసతులను విస్తరించేందుకు ఈ నిధి ఎంతగానో దోహదపడుతుంది. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల పరిధిని క్షేత్రస్థాయి వరకు చేరవేసేందుకే ఈ ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు.

**రూ.2 వేలు దాటితే నామమాత్రపు ఛార్జీ..**

రైల్వేలు, టెలికాం సేవలు, బీమా, ఇంధనం \




వంటి నిర్దిష్ట వ్యాపార విభాగాల్లో రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ.5 ఫ్లాట్ ఎండీఆర్ వర్తిస్తుంది. ఇతర విభాగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించినప్పటికీ, గరిష్ఠంగా ఛార్జీ రూ.300కు మాత్రమే పరిమితం కానుంది. నిత్యం జరిగే లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ.2,000 లోపే ఉంటున్నందున అత్యధిక భాగం లావాదేవీలకు మినహాయింపు దక్కుతుంది.

**డిజిటల్ విప్లవానికి మరింత ఊతం..**

క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, వాలెట్లతో పోలిస్తే యూపీఐ సవరించిన ఎండీఆర్ ఛార్జీలు చాలా తక్కువగా ఉండటం విశేషం. పెద్ద మొత్తాల చెల్లింపుల ద్వారా సమకూరే ఆదాయాన్ని సైబర్ సెక్యూరిటీ, సర్వర్ల ఆధునీకీకరణ, సాంకేతిక పురోగతి కోసం వినియోగించనున్నారు. తద్వారా సరికొత్త వినియోగదారులకు, వ్యాపారులకు మెరుగైన సేవలందిస్తూనే దేశీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత సురక్షితంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం బాటలు వేసింది.

# ఆగాఖాన్‌తో రేవంత్‌రెడ్డి భేటీ

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 16) :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో చారిత్రక భవనాల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు సహకారం అందించాలని అంతర్జాతీయ సంస్థలకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. నగరంలోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ Vతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల దివంగతులైన ప్రిన్స్ రహీమ్ తండ్రి ఆగా ఖాన్ IV మృతి పట్ల సీఎం సంతాపం తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక ఆధారాలైన సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకరించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రికి గోషామహల్‌లో నూతన భవనం నిర్మిస్తున్నామని, పాత భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఫ్యూచర్ సిటీలో విశ్వవిద్యాలయం పెట్టండి..**

శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ తీవ్ర ఆసక్తి కనబరిచారు. దీనిని 15 వేల ఎకరాల గ్రీన్ జోన్‌తో నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దుతున్నామని, సింగపూర్ కంపెనీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని సీఎం వెల్లడించారు. ఇప్పటికే అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకమైన ఆగా ఖాన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా ప్రతిపాదించారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు రండి..**

రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సదస్సుకు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను ప్రభుత్వం ఆహ్వానించింది. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచుతామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. 100కు పైగా దేశాల ప్రతినిధులు పాల్గొనే ఈ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్యాలకు విస్తృత అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
బుధవారం 16.09.2026
www.kalamjyothi.com


# నిర్మల్ కళకు పట్టం

**కళాకారులను కంటికిరెప్పలా కాపాడుకుంటాం**

**పుష్కరాల్లో ప్రత్యేక స్టాళ్లు : కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 16) :** విశ్వవిఖ్యాత నిర్మల్ కొయ్య బొమ్మల కళా వైభవానికి పునరుజ్జీవం పోసేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. కొయ్య బొమ్మల కళను పరిరక్షిస్తూ, కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. రాబోయే పుష్కరాల్లో కొయ్యబొమ్మల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నిర్మల్ పట్టణంలోని కొయ్య బొమ్మల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కొయ్య బొమ్మల చరిత్ర, తయారీ విధానం, మార్కెటింగ్, కళాకారుల పరిస్థితి, పొనికి కర్ర లభ్యత తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మల్ కొయ్య బొమ్మలకు దేశ, విదేశాల్లో గుర్తింపు ఉండడం వల్ల నిర్మల్ జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. బొమ్మల తయారీకి ప్రధానంగా ఉపయోగించే పొనికి చెట్ల పెంపకానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. బాసరలో రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా కొయ్య బొమ్మల ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొయ్య బొమ్మల కళ అభివృద్ధి, కళాకారులకు మరింత ప్రోత్సాహం, మార్కెటింగ్ అవకాశాల పెంపు తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ రాజు, అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



# సైక్లింగ్‌లో వరుణ్ మెరుపు

**రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా**

**జిల్లా ఖ్యాతిని పెంచిన విద్యార్థులు**

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 16)** :రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థి తన సైక్లింగ్ నైపుణ్యంతో రాణించి జిల్లా ఖ్యాతిని చాటాడు. తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సైక్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ విజయ్ కాంత్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు, సబ్ ఇన్‌స్పెక్టర్ చిలుక రణధీర్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా పరిధిలో నిర్వహించిన అండర్ 14, అండర్ 16 విభాగంలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చిలుక రవికుమార్, స్వప్న దంపతుల కుమారుడు చిలుక వరుణ్ పాల్గొన్నారు. ప్రస్తుతం చెన్నారావుపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యను అభ్యసిస్తూ పీఈటీ మంజుల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాపమ్మ ఆదేశాలతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అండర్ 14 విభాగంలో నాల్గో స్థానంలో ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్ సాధించారు. అలాగే అండర్ 16 విభాగంలో చిలుక రామ్ చరణ్ ఐదో స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాలకు సంబంధించిన విద్యార్థులు ఈ సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఉన్న తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ విజయ్ కాంత్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు, సబ్ ఇన్‌స్పెక్టర్ చిలుక రణధీర్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ విషయం తెలిసిన వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థి వరుణ్‌ను అభినందించారు.




# యూనియన్ కార్యదర్శిగా నాగ శ్రీనివాస్



**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 16) :** ప్రభుత్వ కళాశాలల ఉద్యోగుల సంక్షేమ సంఘంలో నిర్మల్ అధికారికి కీలకమైన రాష్ట్ర స్థాయి బాధ్యతలు దక్కాయి. తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నాగ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది నాగ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీనివాస్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# మాట నిలబెట్టుకున్న సర్పంచ్

**నక్కలగుట్ట తండాకు మైక్‌సెట్ అందజేత**

**సేవలోనే నాకు తృప్తి : సర్పంచ్ విక్రమ్**

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 16) :** ఎన్నికల వేళ ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేస్తూ సర్పంచ్ విక్రమ్ తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. చెన్నారావుపేట మండలం పదహారు చింతల తండ గ్రామ పంచాయతీ పరిధిలోని నక్కలగుట్ట తండ యువతకు ఇచ్చిన హామీని సర్పంచ్ విక్రమ్ నెరవేర్చారు. వినాయక చవితి పండుగ సందర్భంగా యువత కోసం రూ.42,000 విలువైన మైక్‌సెట్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి స్ఫూర్తితో బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విక్రమ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో నక్కలగుట్ట తండ యువతకు ఇచ్చిన హామీ మేరకు మైక్‌సెట్‌ను అందజేసినట్లు తెలిపారు. ప్రజాసేవలో ముందుండి పనిచేయాలనే స్ఫూర్తిని ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి నుంచి పొందుతున్నానని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు. మైక్‌సెట్‌ను అందజేసిన సర్పంచ్ విక్రమ్‌కు నక్కలగుట్ట తండ యువకులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, మాజీ సర్పంచ్ గణేష్, కేశ్య, జెత్య నాయక్, కిషన్, శంకర్, శ్రీను, రాజు, బద్రు, చందు, నక్కలగుట్ట తండ యువకులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# నీట్‌లో గీతిక అద్భుత ప్రతిభ

**ఫలితాలలో 1,68,372 ర్యాంకు**



**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 16) :** నిరుపేద కుటుంబానికి చెందిన పల్లెటూరి విద్యార్థిని పట్టుదలతో శ్రమించి వైద్య విద్యను అభ్యసించే అవకాశాన్ని చేజిక్కించుకుంది. చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన కుసుమ నరేందర్, కళ్యాణి దంపతుల కూతురు కుసుమ గీతిక జూలై నెలలో నిర్వహించిన నీట్ పరీక్ష రాసింది. ప్రభుత్వం వెలువరించిన నీట్ ఫలితాలలో 1,68,372 ర్యాంకును సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. గీతిక నిరుపేద కుటుంబంలో పుట్టి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో తల్లిదండ్రులు నరేందర్, కళ్యాణి, గ్రామస్తులు తదితరులు ఆమెను అభినందించారు.

# గిరిజన ద్రోహి కాంగ్రెస్

- ఓట్ల కోసమే దొంగ డిక్లరేషన్
- గిరిజనుల హక్కులను కాలరాశారు
- పోడు భూములకు దిక్కేది
- రాబోయే రోజుల్లో గుణపాఠం చెబుతాం
- మాజీ జెడ్పీటీసీ బానోతు పత్తి నాయక్



**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 16) :** అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కాంగ్రెస్ పార్టీ గిరిజన వర్గాల ప్రయోజనాలను తుంగలో తొక్కి మోసం చేసిందని బీఆర్ఎస్ ధ్వజమెత్తింది. చెన్నారావుపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గిరిజన ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ బానోతు పత్తి నాయక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ గిరిజనులకు పెద్దపీట వేశారన్నారు. ఎస్టీ రిజర్వేషన్లు 6 శాతం నుండి 10 శాతానికి పెంచారన్నారు. అలాగే ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.13,412.63 కోట్లు కేటాయించారన్నారు.

**బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి..**

అదేవిధంగా గిరిజన రైతుల బంజరు, సాగుకు పనికిరాని భూములను సాగులోకి తీసుకురావడానికి గిరి వికాసం పథకాన్ని అమలు చేసి 19 వేల 698 మంది గిరిజన రైతులకు చెందిన 56 వేల 613 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చారన్నారు. అలాగే గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి రోడ్లు, విద్యుత్, తాగునీరు, మౌలిక వసతుల కోసం ఎస్టీ ఎస్డీఎఫ్‌లో రూ.1,000 కోట్లు ప్రత్యేకంగా నిధులను కేటాయించి అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టీ డిక్లరేషన్‌లో ఓట్ల కోసం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించి ఎస్టీలను మోసం చేసిందన్నారు.

**పోడు భూములకు హక్కులు..**

అర్హులైన గిరిజనులందరికీ పోడు భూములపై హక్కులు కల్పించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, గిరిజనుల భూములను లాక్కొని గిరిజన మహిళలను బట్టలు చినిగేలా కొట్టించారన్నారు. మూడు కొత్త గిరిజన కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్ల గ్రాంట్ ఇస్తామని హామీ ఇచ్చి, తుకారాం ఆదివాసీ కార్పొరేషన్, సంత్ సేవాలాల్ లంబాడా కార్పొరేషన్, ఎరుకల కార్పొరేషన్ మూడు కార్పొరేషన్లు ఎక్కడ ఉన్నాయని, ఒక్కో కార్పొరేషన్‌కు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేటాయించారా అని ప్రశ్నించారు. ప్రతి తండా గ్రామపంచాయతీకి ప్రతి ఏడాది రూ.25 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఏ ఒక్క తండా గ్రామ పంచాయతీకి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా క్యాబినెట్‌లో మా గిరిజన బిడ్డలకు మంత్రి పదవి ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

**గిరిజనుల సత్తా చూపిస్తా..**

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే రానున్న రోజుల్లో గిరిజనుల సత్తా ఏంటో చూపించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ పార్టీ గిరిజన ముఖ్య నాయకులు గుగులోతు స్వామి నాయక్, బానోతు లాల్ సింగ్, ఆంగోతు వీరాసింగ్, తిమ్మరాయిని పహాడ్ సర్పంచ్ దారావత్ రమేష్, బాదావత్ వీరన్న నాయక్, బోడ మురళి నాయక్, భూక్య కిషన్ నాయక్, బోడ ఆనంద్, భూక్య శ్రీనివాస్, గుగులోతు లాలు, మూడు రమేష్, బోడ సంపత్, అజ్మీర బాలాజీ, బాలు, కోర్ర మోహన్, లావుడియా దేవ్ సింగ్, గుగులోతు ప్రభాకర్, గుగులోతు రాజేందర్, భూక్య రాజు, గుగులోతు కిరణ్, భూక్య గణేష్, భాస్కర్, గిరిజన నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో ఆదుకున్న సర్కారు

## నిరుపేదలకు సంజీవని సీఎంఆర్ఎఫ్

## లక్ష్మణ్‌చారికి చెక్కు అందజేత

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 16)** :అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపద్బాంధవుడిలా నిలుస్తోంది. ఆస్పత్రుల్లో చికిత్స పొందే పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పాత మగ్దంపురం గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్ అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పాత మగ్దంపురం గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ననుమాస కరుణాకర్ మాట్లాడుతూ పేదలు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందిన సమయంలో ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. గ్రామానికి చెందిన కట్టూరి లక్ష్మణ్‌చారికి రూ.19 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. అవసరమైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్వాల శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ ననుమాస వీరస్వామి, వార్డు సభ్యుడు నాంపల్లి సంపత్, లక్ష్మణ్‌చారి, నాయకులు బొత్త పాషా, యూత్ అధ్యక్షుడు గద్దల ప్రశాంత్, పరికి నవీన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు చేయూత

## లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలి

## డిజిటల్ చెల్లింపులపై తర్ఫీదునివ్వండి

## కలెక్టర్ భవేశ్ మిశ్రా



**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 16) :** గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక స్వావలంబన కోసం బ్యాంకింగ్ రుణాల పంపిణీని వేగవంతం చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి అధికారులు నిరంతరం కృషి చేస్తూ, రుణ మంజూరు లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాల్లో చేరేలా చూడాలన్నారు. మహిళా సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మంజూరు చేసిన రుణాలు, మొత్తం రుణ లక్ష్యం, రుణాల తిరిగి చెల్లింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రుణ మంజూరు లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. మహిళా సంఘాలకు రుణాలు అందిస్తే స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదుగుతారన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని వివరించారు. డిజిటల్ చెల్లింపులలో వారిని ప్రోత్సహించాలని తెలిపారు. రుణాల తిరిగి చెల్లింపులో డిజిటల్ మాధ్యమాలు వినియోగించేలా వారికి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎల్డీఎం రామ్‌గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

## చిన్నారుల ఎదుగుదలపై శ్రద్ధ

## ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధ

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 16) :** చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారమే శ్రీరామరక్ష అని సర్పంచ్ రమేష్ పేర్కొన్నారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయన్ పహడ్ గ్రామ అంగన్‌వాడీ మూడో కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ రమేష్ హాజరై మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను నిర్వహించి, వివిధ రకాల ఆహార పదార్థాల్లో లభించే పోషక విలువలను వివరించారు. చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెనూ ప్రకారం కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానోత్ రవి, వార్డు సభ్యులు నాగోతు రజిత, మంద విజయ్, అంగన్‌వాడీ టీచర్లు అరుణ కుమారి, రాజ్యం, ఆశా కార్యకర్త అనిత, ఆయాలు శాంతమ్మ, హస్లీ, గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.




# చరిత్రను చెరిపేయలేరు

## పోరాటాన్ని మతంతో ముడిపెట్టొద్దు

### విలీన దినాన్ని అధికారికంగా జరపాలి

### TGS జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్

**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 16) :** తెలంగాణ నేల విముక్తి కోసం సాగిన చారిత్రక పోరాట వాస్తవాలను ఎవరూ మరుగున పరచలేరని గిరిజన సమాఖ్య తేల్చిచెప్పింది. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల హృదయాల నుంచి చెరిపివేయలేరని తెలంగాణ గిరిజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో భూక్య శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన మహత్తర ప్రజా పోరాటమే తప్ప మతాల మధ్య ఘర్షణ కాదన్నారు. సెప్టెంబర్ 17 చరిత్రను మత విద్వేషాలకు వాడుకోవడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో సాగిన ఉద్యమ వారసత్వాన్ని తుడిచిపెట్టే యత్నాలను తిప్పికొట్టాలని, పీడిత ప్రజల హక్కుల సాధనకు ఆనాటి పోరాట స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజీఎస్ నాయకులు బానోతు వెంకట్, గోవిందు, ఉపేందర్, హత్తిరామ్, హరి, రమేష్, సురేష్, రమేష్ బాబు, బావు సింగ్, మోహన్, రవి, రాంప్రసాద్, చందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలి

## మతసామరస్యంతో శోభాయాత్ర జరుపుదాం

### నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 16) :** మతసామరస్యానికి ప్రతీకగా వినాయక నిమజ్జన వేడుకలను ఐక్యంగా జరుపుకోవాలని జిల్లా పోలీసు శాఖ పిలుపునిచ్చింది. వినాయక నవరాత్రుల నేపథ్యంలో ముగింపు శోభాయాత్రను ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు కృషి చేద్దామని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ జిల్లాలో ప్రజల మధ్య ఉన్న సోదరభావం, పరస్పర సహకారం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై మతపెద్దలు ఎస్పీకి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భూమి, భుక్తి, విముక్తి పోరాటం చారిత్రాత్మకం

## అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

### సీపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి జమలయ్య



**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 16) :** నాటి తెలంగాణ రైతాంగ విముక్తి పోరాట ఆశయ సాధనకు సమరశీల ఉద్యమాలే సరైన మార్గమని వామపక్ష శ్రేణులు స్పష్టం చేశాయి. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని సీపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని 3 టౌన్ పరిధి బూడిదగడ్డ సీపీఐ కార్యాలయంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా, అనంతరం నాయకులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, జి. వీరాస్వామి మాట్లాడుతూ నిరంకుశ నిజాం, భూస్వామ్య దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక అధ్యాయమని కొనియాడారు. వేలాది మంది కమ్యూనిస్టు యోధులు ప్రాణాలర్పించి పేదలకు భూమి, భుక్తిని అందించారని గుర్తుచేశారు. నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఎర్రజెండా అండతో సమరశీల పోరాటాలు నిర్మించడమే అమరులకు నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు భూక్య శ్రీనివాస్, గొనె మని, నేరెళ్ల రమేష్, విజయలక్ష్మి, నాయకులు మాచర్ల శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బోయిన విజయ్ కుమార్, బండి దుర్గ, తుమ్మ నర్సయ్య, శాపావట్ రవి, అజీజ్, గడ్డం సతీష్, ప్రభాకర్, ధనరాజ్, సాంబి రెడ్డి, నరేష్, పసునూటి రమేష్, నట్టే వీరయ్య, రాజేశ్వరరావు, శివ, సుజాత, రూపేష్, రంజిత్, ఓదెలు, సిందేం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఏ అధ్యక్షుడికి సన్మానం




**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 16) :** వైద్యరంగంలో విశేష సేవలందిస్తూ ఐఎంఏ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన డాక్టర్ రమేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ రమేష్‌ను వశిష్ఠ యోగ సంఘటన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైద్య రంగంలో మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యోగ సంఘటన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యోగ సంఘటన్ అధ్యక్షుడు డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్, కార్యదర్శి డాక్టర్ కూన ప్రవీణ్, యోగగురు బాలాజీ, గురుప్రసాద్, డాక్టర్ రాజేశ్వర్, బాపురెడ్డి, నారాయణ రెడ్డి, నరేందర్ రెడ్డి, గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మండపంలో వెలుగుల విందు

## కనువిందు చేస్తున్న లేజర్ షో

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 16) :** గణనాథుని మండపంలో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక కాంతులు పట్టణ భక్తులను కట్టిపడేస్తున్నాయి. వినాయక చవితి సందర్భంగా నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో వినాయకుని వద్ద ఒక్కో రకమైన అలంకరణలతో ఆయా గణేష్ మండళ్ల నిర్వాహకులు పోటీ పడుతున్నారు. ఈసారి నిర్మల్ రాధాకృష్ణ మందిరంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం చూపరులను ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ విఘ్ననాథుని దర్శించుకునేందుకు వస్తున్న వారికి నిర్వాహకులు ఏర్పాటు చేసిన లేజర్ షో ఆకట్టుకుంటోంది.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక



## రష్మిక సోలో స్టార్ ఇమేజ్ తెచ్చుకుంటుందా?

వరుసగా పాన్ ఇండియా సినిమాలు.. స్టార్ హీరోలతో క్రేజీ కాంబినేషన్స్.. రష్మిక కెరీర్ ఫుల్ బిజీగా ఉంది. ఒక సినిమాలో తన షూట్ కంప్లీట్ కావడంతో తన యాక్టింగ్ పై ప్రశంసలు కురిపించారు చిత్ర యూనిట్. అయితే 'మైసా'తో రష్మిక సోలో స్టార్ ఇమేజ్ ను తెచ్చుకుంటుందా? లేక స్టార్ హీరోల సినిమాల్లో హిట్ అయిన హీరోయిన్ గానే మిగిలిపోతుందా? విజయ్ దేవరకొండతో రష్మికకు ఉన్న కాంబినేషన్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కానీ 'రణబాలి'లో మాత్రం జయమ్మ పాత్రతో ఈ జోడీ మరోసారి కొత్తగా కనిపించబోతుంది. ముఖ్యంగా రష్మిక బేబీ బంప్ తో కనిపించిన వీడియో ఇప్పుడు సినిమాపై ఆసక్తిని పెంచుతుంది. స్పెషల్ గా కేర్ తీసుకొని రాసిన జయమ్మ పాత్ర గురించి ఎమోషనల్ పోస్ట్ చేశాడు రాహుల్ సాంకృత్యన్. ఇక రష్మిక పాత్రకు సంబంధించి 'రణబాలి' షూట్ పూర్తయింది. ప్రస్తుతం రష్మిక ఫోకస్ 'మైసా'. అయితే ఆమె కెరీర్ లో 'మైసా' మరో కొత్త ప్రయోగం. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్, లవ్, ఫ్యామిలీ క్యారెక్టర్స్ లో కనిపించిన రష్మిక ఇందులో మాస్ యాక్షన్ అవతార్ లో కనిపించనుంది. ముఖ్యంగా అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్ అవుతుందని టాక్. ఇక రష్మిక అప్ కమింగ్ లిస్ట్ చూస్తే వరుసగా పాన్ ఇండియా సినిమాలు, భారీ బడ్జెట్లు! కానీ స్టార్ హీరోల సినిమాలతో సక్సెస్ లో భాగం కావడం వేరు, తన పేరుతోనే ఓ సినిమాను సక్సెస్ చేయడం వేరు. మరి రష్మిక రెండో స్టెప్ 'మైసా'తో నెరవేరుతుందో లేదో చూడాలి.